ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
శుక్రవారం | 12 డిసెంబరు, 2025 | పేజీలు :04

## 14న రెండవ విడత పంచాయతీ ఎన్నికలు


మెయిన్‌లో

### కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య

# సాఫీగా సాగిన ఓట్ల లెక్కింపు



**పర్యవేక్షించిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడి**

**ప్రజాపక్షం/ఎడపల్లి:** గ్రామ పంచాయతీ తొలి విడత ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిజామాబాద్ జిల్లాలో ప్రశాంతంగా కొనసాగింది. ఓటింగ్ నిర్వహించిన మీదట సంబంధిత పోలింగ్ కేంద్రాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపు జరిపారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి కౌంటింగ్ పక్రియను ఆద్యంతం పర్యవేక్షణ నిర్వహించి, కౌంటింగ్ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్ సైతం కౌంటింగ్ కేంద్రాలను విస్తృతంగా సందర్శిస్తూ ఓట్ల లెక్కింపు తీరును నిశితంగా పరిశీలించారు. ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఫలితంగా ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాఫీగా జరిగింది. కౌంటింగ్ కేంద్రాలతో పాటు పరిసరా ప్రాంతాలలో గట్టీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి, నిషేదాజ్ఞలు అమలు చేశారు. పకడ్బంది ఏర్పాట్ల నడుమ అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో పూర్తి పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

### ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికలు

# కరీంనగర్‌లో 81.42%


మెయిన్‌లో

### జిల్లాలో ప్రశాంతంగా మొదటి విడత

# పంచాయతీ ఎన్నికలు





**ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**ప్రజాపక్షం/నస్పూర్ :** రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళి, కౌంటింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలలో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. జిల్లాలో గుర్తించిన 24 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, ఎన్నికల విభాగం విభాగం అధికారులు పాల్గొన్నారు.

### అడ్డంగా ఉన్న భారీ వృక్షాలను, సోలార్,

# విద్యుత్ పోల్స్‌ను తొలగించాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని తొమ్మిదో డివిజన్ జనగామ లో ప్రధాన రోడ్డు నిర్మాణానికి అడ్డంగా ఉన్న భారీ వృక్షాలను, సోలార్ పోల్స్ మరియు విద్యుత్ పోల్స్ ను తొలగించాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ ఒక ప్రకటన లో కార్పొరేషన్ అధికారులను కోరారు. గత కొన్ని సంవత్సరాలుగా జనగామ ప్రజలు ఇట్టి రోడ్డు అధ్వాన్నంగా ఉందని కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరిన మేరకు కార్పొరేషన్ అధికారులు గత పది రోజుల క్రితం రోడ్డు నిర్మాణం చేపట్టారని ఆయన పేర్కొన్నారు. పాత రోడ్డు 20 ఫీట్లు ఉండగా దాన్ని 30 ఫీట్లు గా పెంచి రోడ్డు నిర్మాణం పనులు మొదలు పెట్టారని ఆయన అన్నారు. ఇట్టి రోడ్డు కు ఇరువైపులా ఐదు ఫీట్ల వెడల్పు తో కంకర చూర నింపుతున్నారని, ఇందులో సోలార్ పవర్ లైటింగ్ పోల్స్, విద్యుత్ పోల్స్ తొలగించకుండా, భారీ వృక్షాలను తొలగించకుండా కంకరను నింపుతున్నారని దీని వల్ల రోడ్డు నిర్మాణం లోప భూయిష్టంగా ఉందని ఆయన తెలిపారు. కనుక కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి అడ్డంగా ఉన్న సోలార్ పవర్ లైటింగ్ పోల్స్, విద్యుత్ పోల్స్ మరియు భారీ వృక్షాలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటన లో కోరారు.

# సమస్యల పరిష్కారానికి హెచ్ఆర్సిఐ కృషి



**ప్రజాపక్షం/గోదావరిఖని :** అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా జిల్లా అధ్యక్షులు కొండల రాజేందర్‌కుమార్ ఆధ్వర్యంలో రామగుండం అక్బర్ నగర్‌లో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు చెన్నుపాటి శ్రీకాంత్, జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి మాదాసి చారేంద్ర సూచనల మేరకు మానవ హక్కుల గురించి, నిత్య జీవితంలో మానవ హక్కుల ప్రాధాన్యత గురించి చర్చించారు. రాజ్యాంగం కల్పించిన ప్రతి హక్కును అందరూ వినియోగించుకోవాలన్నారు. ఏవరికి ఏలాంటి సమస్య వచ్చిన తమ కార్యాలయంలో సంప్రదిస్తే పరిష్కారం కోసం సహాయ, సహకారాలను అందిస్తామని రాజేందర్‌కుమార్ తెలిపారు. గోదావరిఖని విఠల్‌నగర్‌లోని అమ్మ పరివార్ అనాథ ఆశ్రమంలో 100 మందికి అన్నదానం చేశారు. వీర్లపల్లిలోని ఈశ్వరా కృప వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంచారు. ఈ కార్యక్రమంలో సంస్థ అదనపు జనరల్ సెక్రటరి బొంకూరి కైలాసం, సిహెచ్.చంద్రకాంత్, జాగటి శాంతమ్మ, గుండవెల్లి లక్ష్మి, అబ్ధుల్ సలీం, సిరికొండ కోటి, అజీమ్, రామ్మూర్తి, సరిత, మురళి, సాయికుమార్‌లు పాల్గొన్నారు.

## మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** స్థానిక సంస్థల ఎన్నికల పోరులో మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు.గురువారం రోజున జూలపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి, కుమ్మరి కుంట గ్రామాల్లో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో హాజరై వారు మాట్లాడుతూ ప్రజలకు హామీలు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చాలా సులభమైపోయింది కానీ, వాటిని నిలబెట్టుకోవడంలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండు సంవత్సరాలుగా ప్రజలకు మోసపూరిత పాలన చూపుతూ, హామీలను అమలు చేయకపోగా కేవలం మాటలతోనే మభ్యపెడుతూ రోజులు గడిపిందని మండిపడ్డారు.స్థానిక సంస్థల ఎన్నికలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఓటమి భయంతో రెండు సంవత్సరాలు ఆలస్యం చేసిందని, ప్రజాస్వామ్య వ్యవస్థను తప్పుదారి పట్టించే విధంగా వ్యవహరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలంటే బలమైన నాయకత్వం ఉన్న బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించడం ఎంతో అవసరమని, గ్రామాభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారం, స్వచ్ఛమైన పాలన కోసం బిఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, మల్లేశం, ప్రసాద్, సతీష్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారంలో రాం సుధాకర్ రావు

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని పలు గ్రామాలలో గురువారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామెర రాం సుధాకర్ రావు గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ధర్మపురి మండలంలోని కమలాపూర్, జైన, నేరేళ్ల, తిమ్మాపూర్, ఆరేపెల్లి, నక్కలపేట గ్రామలతోపాటు వెల్గటూర్ మండలం కోటిలింగాల, బుగ్గారం మండలాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకై బిజెపి మద్దతుతో పోటీ పడుతున్న అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాల్సిందిగా ఆయన ఓటర్లను కోరారు.ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి ధ్యేయంగా భారతదేశాన్ని అన్నిరంగాలలో ప్రగతి సాధించిన విషయాన్ని రాం సుధాకర్ రావు గుర్తుచేశారు.అవినీతి రహిత పాలన బిజెపి ద్వారానే సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుబాయిలో ఆపస్మారక స్థితిలో ఉన్న భర్త



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** పొట్ట చేతపట్టుకొని ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టిన జగిత్యాల జిల్లా, మండల కేంద్రానికి చెందిన ఆరెల్లి గంగరాజం దుబాయిలో కోమాలో అపస్మాకర స్థితిలో ఉన్నాడని తన భర్త ఆరెల్లిగంగరాజంను ఇండియాకు తెప్పించాలని జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలం పొలాసకు చెందిన రాజవ్వ ఇటీవల హైదరాబాద్ బేగంపేట ప్రజా భవన్ లో సీఎంప్రవాసీ ప్రజావాణి లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేరిట దరఖాస్తు చేశారు. గుండె సంబంధిత ఆరోగ్య సమస్యతో అకస్మాతుగా అపస్మారక స్థితిలోకి జారిన గంగరాజం (64) నవంబర్ 12 నుంచిదుబాయి అల్‌గెసిస్ లోని ఆస్టర్ హాస్పిటల్ లో కోమాలో ఉన్నాడు. వెంటనే స్పందించిన తెలంగాణ ప్రభుత్వ జిఏడి ఎన్నారై విభాగం దుబాయిలోని ఇండియన్ కాన్సులేట్ తో సంప్రదింపులు జరిపింది.

నిమ్స్ లో వైద్య చికిత్సకు హామీ ఇచ్చిన జి.చిన్నారెడ్డి : తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి సహకారంతో పేషెంట్‌కుటుంబ సభ్యులు సీఎం ప్రజావాణి ఇంచార్జి, తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డా. జి.చిన్నారెడ్డినికలిశారు. పేషేంట్ దుబాయి నుంచి హైదరాబాద్ చేరుకున్న తర్వాత నిమ్స్ హాస్పిటల్ లో వైద్యం అందించాలని అయనసంబంధిత అధికారులను ఆదేశించారు. పేషేంట్ గంగరాజం కుమారుడు జలంధర్, దుబాయిలోనేఉండటం వలన దగ్గరుండి సపర్యలు చేస్తున్నారు. దుబాయిలోని తెలంగాణ సామాజిక సేవకులు రవి డేవిడ్ ఇండియన్ కాన్సులేట్, కంపెనీ యాజమాన్యం, హాస్పిటల్ తో సమన్వయం చేస్తున్నారు.

## విప్లవ పార్టీల మద్దతు అభ్యర్థులను గెలిపించండి



**ప్రజాపక్షం/గోదావరిఖని :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేటలో విప్లవ పార్టీలైన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా బలపరుస్తున్న గ్రామ సర్పంచితోపాటు పది మంది వార్డు సభ్యుల అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ ఆ పార్టీల నాయకులు గురువారం గ్రామంలో విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సర్పంచి అభ్యర్థి తూళ్ల రాజేష్, వార్డు సభ్యులకు కేటాయించిన గుర్తులపై ఓటు వేసి వారికి గెలుపును అందించాలన్నారు. ఈ సందర్భంగా నాయకులు జి.సత్యనారాయణరెడ్డి, ఈదునూరి నరేష్‌లు మాట్లాడుతూ, పదవులను వ్యాపారంగా మార్చే వారిని ఎన్నికల్లో ఓడించాలన్నారు. ప్రజలు, గ్రామ అభివృద్ధి కోసం పోరాడే వారిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అభ్యర్థి తూళ్ల రాజేష్, నాయకులు మెరుగు చంద్రయ్య, కోడిపుంజుల జ్యోతి, ఇసంపల్లి రాజేందర్, పైడిపెల్లి రమేష్, ఆడెపు శంకర్, మార్త రాములు, మాలెం తిరుపతి, పెండ్యాల ఓదేలు, టి.గట్టయ్య, సృజన్ కుమార్, సతీష్, సిహెచ్.రాజేందర్, టి.తిరుపతి, వెంకటేష్, రామచంద్రం, వెంకటి, టి.లక్ష్మి, పి.లక్ష్మి, యు.భూమమ్మ, అరుణోదయ రామస్వామిలు పాల్గొన్నారు.

## అంతర్ విశ్వవిద్యాలయ వ్యాయామ క్రీడల సెలక్షన్స్



**ప్రజాపక్షం/కరీంనగర్:** శాతవాహన విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయ వ్యాయామ క్రీడల ఎంపికలు జరిగాయి. ఈ పోటీలు రాజీవ్ గాంధీ ఆరోగ్య విశ్వవిద్యాలయం బెంగళూరులో జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, వ్యాయామ క్రీడల వల్ల శారీరక దృఢత్వం పెరుగుతుందని, ఎముకలలో బలం పెరుగుతుందని కండరాలు పటిష్టమవుతాయని, గుండె పనితీరు కూడా మెరుగవుతుందని దీనితో విద్యార్థుల ఆత్మ ధైర్యం పెరుగుతుందని దీనివల్ల మానసిక స్థితి పెరుగుతుందని ధ్రుడ నిశ్చయం, అంకిత భావం, క్రమశిక్షణ, సమస్య పరిష్కార గుణం అలవాడతాయని విద్యార్థులు శారీరక, క్రీడా నైపుణ్యాలు పెంచుకొని విజయంతో బహుమతులు గెల్చుకొవచ్చని తెలిపారు. ఆటలన్నింటిలోనూ వ్యాయామ క్రీడలు ఎంతో ముఖ్యమైనవని తెలిపారు. ఈ సెలక్షన్ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పరిధిలోని బాలురు బాలికలకు వ్యాయామ క్రీడలైన 100 మీటర్ల, 200 మీటర్ల, 400 మీటర్ల, 800 మీటర్ల, 1600 మీటర్ల, ఐదు కిలోమీటర్లు, పది కిలోమీటర్ల పరుగులు, జావలిన్ త్రో డిస్కస్ త్రో, లాంగ్ జంప్, షాట్ పుట్ మొదలైన ఎంపికలు జరిగాయి. ఇందులో స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ నజీముద్దీన్ మునవర్,విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డా|| మనోజ్ కుమార్, పిడి విజయకుమార్, వివిధ కళాశాలల వ్యాయామ అధికారులు దినేష్, పర్వీన్, కోచ్ లు అరవింద్, జిలాని వివిధ కళాశాలల వ్యాయామ క్రీడాకారులు పాల్గొన్నారు.

## నేడే అయ్యప్ప మహాపడి పూజ



**ప్రజాపక్షం/చందుర్తి :** మండల కేంద్రం లోని ప్రధాన కూడలి గచ్చు బావి ఆవరణలో నేడే అయ్యప్ప మహాపడి పూజ మహోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా జరుగనుంది.గత 18 సంవత్సరాలు గా ప్రతి సంవత్సరం డిసెంబర్ 12 వ తేదీన మండల కేంద్రం లో అయ్యప్ప మహాపడి పూజ మహోత్సవ కార్యక్రమాన్ని గూడెం గురు స్వామి చక్రవర్తుల పురుషోత్తమ చారి చేతుల మీదుగా ఘనంగా నిర్వహిస్తున్నామని అయ్యప్ప సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు.మండలం లోని అన్ని గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని అయ్యప్ప సేవా సమితి సభ్యులు కోరారు.

## విద్యావంతురాలికి అవకాశం కల్పించండి

**ప్రజాపక్షం/గోదావరిఖని :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఘన్‌శ్యామ్‌దాస్‌నగర్ సర్పంచి అభ్యర్థిగా పోటీ చేస్తున్న బండారి శ్రీవాణికిరణ్ గురువారం గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉన్నత విద్యావంతురాలైన తనను ఎన్నికల్లో గెలిపించాలని ఆమె గ్రామ ప్రజలను కోరారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఎంపిటిసి సభ్యురాలిగా అయిదేళ్లపాటు తాను గ్రామంలో సేవలను అందించినట్లు తెలిపారు. గ్రామ సమస్యలపై పూర్తి అవగాహన ఉన్నందున వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తానన్నారు. సర్పంచిగా తనకు అవకాశం కల్పించాలని, ప్రధానంగా మహిళల అభివృద్ధికి పాటు పడ్తానని బండారి శ్రీవాణి తెలిపారు.

## ఆదరించి ఆశీర్వదించండి గ్రామానికి సేవకుడిలా పని చేస్తా

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** సుద్దాల గ్రామ ప్రజలు ఆదరించి ఆశీర్వదించితే గ్రామానికి నాయకుడు లా కాకుండా సేవకుడిలా పని చేస్తానని సుద్దాల గ్రామ సర్పంచ్ అభ్యర్థిఓజ్జా సంపత్ యాదవ్ గ్రామంలోని ఓటర్లను కోరారు. గురువారం గ్రామానికి చెందిన మహిళా ఓటర్లతో దాదాపు 300 మందితో ర్యాలీగా వెళ్లి తనకు కేటాయించిన ఉంగరం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామ ఓటర్లను కోరారు. సంపత్ యాదవ్ గడపగడప తిరుగుతూ ఓటు అభ్యర్థించడమే కాకుండా పంట పొలాలలో రైతులను, గీతా కార్మికులను వినూత్నంగా ఓటు అభ్యర్థించారు. అనంతరం సర్పంచ్ అభ్యర్థి సంపత్ యాదవ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆశీర్వదించి గ్రామ సర్పంచిగా అవకాశం కల్పిస్తే గ్రామానికి నాయకుడిలా కాకుండా సేవకుడిలా పని చేస్తానని గ్రామంలోని సమస్యలు పరిష్కారం అయ్యేందుకు నిరంతరం కృషి చేస్తానని సుద్దాల గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రచారంలో దూసుకుపోతున్న ఆడెపు తిరుపతి

**ప్రజాపక్షం/బీర్‌పూర్:** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని తుంగూరు గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్ అభ్యర్థి అయిన ఆడేపు తిరుపతి ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రచారంలో భాగంగా ఓటర్లతో మాట్లాడుతూ మన తుంగూరు గ్రామంలో మన రైతుల కోసం సహకార సంఘం సొసైటీని ఏర్పాటు చేస్తానని సొంత డబ్బులతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రెండు గుంటల భూమి కొనిస్తాను అని అలాగే నూతన గ్రామపంచాయతీ నిర్మిస్తానని మహిళా సంఘం భవనము యువత నిరుద్యోగులకు ఉపయోగపడేలా స్టడీ రూమ్ ఏర్పాటుచేసి అందులో అవసరమగు పుస్తకాలను సమకూర్చి అలాగే బస్టాండ్ లో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తానని తుంగూరు బస్టాండ్ నుండి గుట్ట రాజరాజేశ్వర స్వామి ఆలయం నుండి దొంతపూర్ వ రకు నూతన రోడ్డు నిర్మాణం చేస్తానని గ్రామంలో కోతుల కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకుంటానని అలాగే సిసి రోడ్లు మురికి కాలువలు వీధిలైట్లు గ్రామంలో వేయిస్తానని అన్నారు. మీ అమూల్యమైన ఓటు కత్తెరపై వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# నిర్మల్ తొలి దశ సర్పంచ్ ఎన్నికల్లో..
# మామడ,ఖానాపూర్,పెంబిలలో కాంగ్రెస్

**ప్రజాపక్షం/నిర్మల్,ఖానాపూర్,లక్ష్మణ్‌చందా:** నిర్మల్ జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ విజయవంతంగా ముగిసిన వెంటనే,నాలుగు మండలాల్లోని గ్రామ సర్పంచుల విజేతలను అధికారికంగా ప్రకటించారు.వెలువడిన తుది ఫలితాల ప్రకారం,మామడ,ఖానాపూర్,పెంబి మండలాల్లో కాంగ్రెస్ పార్టీ బలమైన ఆధిపత్యాన్ని కనబరిచింది.ఈ నాలుగు మండలాల్లో ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా పలు కీలక గ్రామాల్లో విజయం సాధించి తమ సత్తా చాటారు.

### మామడ,ఖానాపూర్,పెంబి మండలాల్లో కాంగ్రెస్ విజయం..

మామడ మండలంలో తోటి గుడ్డ సర్పంచ్‌గా సిడం మోతిబాయి.ఆదర్శనగర్ సర్పంచ్‌గా బరకుంట లక్ష్మీ ,మొండిగుట్ట సర్పంచ్‌గా ఉప్పెర లక్ష్మీ ,గాయిదపల్లి సర్పంచ్‌గా జాదవ్ సంతోష్,న్యూ లింగంపల్లి సర్పంచ్‌గా గంగన్న,దిమ్మదుర్తి సర్పంచ్‌గా ఆలెపు లక్ష్మణ్ కాంగ్రెస్ తరుపున గెలిచారు.అలాగే,కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులుగా తాండ్ర సర్పంచ్‌గా కస్తూరి భాస్కర్ ,నల్దుర్తి సర్పంచ్‌గా సుదరి సున్నిత గెలుపొందారు.

ఖానాపూర్ మండలంలో కూడా కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ స్థానాలు దక్కాయి.కొత్తపేట సర్పంచ్‌గా సిద్ధపల్లవి,సేవ్య నాయక్ తండా సర్పంచ్‌గా భూఆక్య స్రవంతి,దిలావర్పూర్ సర్పంచ్‌గా చింతల మల్లేష్,తర్లపాడు సర్పంచ్‌గా పోలంపల్లి సచిన్,సింగపూర్ సర్పంచ్‌గా అల్లుల లత,బాబాపూర్(కె) సర్పంచ్‌గా మైస రాజేష్ కాంగ్రెస్ తరపున విజయం సాధించారు.పెంబి మండలంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంది.యాపల్ గూడ,శెట్‌పల్లి,వేణునగర్, దొం దరి,పెంబి తాండ,కృష్ణ నాయక్ తాండ,పసుపుల,తాటి గూడ ,కర్ణం లొద్ది,పోచంపల్లి,రాయదారి గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు.

### లక్ష్మణ్‌చందా మండలంలో బీజేపీ ఆధిపత్యం..

లక్ష్మణ్‌చందా మండలంలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) తమ బలాన్ని నిరూపించుకుంది.పొట్టిపెల్లి(కె) సర్పంచ్‌గా చింతకింది ముఖేష్,తిరిపెల్లి సర్పంచ్‌గా గిరిజ,న్యూ కంజర్ సర్పంచ్‌గా ముద్దం మోహన్‌రెడ్డి,నర్సాపూర్ (డబుల్‌రేని)సర్పంచ్‌గా మల్లేష్,పిచర సర్పంచ్‌గా తిప్పని రాజేశ్వర్,మునిపెల్లి సర్పంచ్‌గా మేడిపల్లి సునీత బీజేపీ తరుపున విజయకేతనం ఎగురవేశారు.అయినప్పటికీ,బాబాపూర్,బోరిగం,చింతల్ చందా,ధర్మారం గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొంది,బీజేపీకి గట్టి పోటీ ఇచ్చారు.

### స్వతంత్ర అభ్యర్థులు,బీఆర్ఎస్ గెలుపు..

ఈ నాలుగు మండలాల్లోనూ స్వతంత్ర అభ్యర్థులు,బీఆర్ఎస్ అభ్యర్థులు కూడా గణనీయ విజయాలు సాధించారు.మామడలో పోతారం,రాయదరి,మల్లాపూర్, అనంతపేట గ్రామాల్లో స్వతంత్రులు గెలిచారు.ఖానాపూర్ మండలంలో చందునాయక్ తాండ,ఎక్బాల్ పూర్, గోడలపంపు,ఎల్లాపూర్ పాత,బీర్నంది, సుర్జాపూర్ గ్రామాల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు.పెంబి మండలంలో హరిచంద్ తాండ,గుమ్మెన యగ్లాపూర్ గ్రామాల్లో స్వతంత్రులు గెలిచారు.ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి,ఎర్వచింతల్,బాదన్‌కుర్తి, గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు,పెంబి మండలంలోని అంకెన,ఇటిక్యాల గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు.తొలి దశ ఫలితాలు జిల్లాలో అన్ని పార్టీలకు కొంత పట్టు ఉన్నప్పటికీ,కాంగ్రెస్ పార్టీ మూడు మండలాల్లో ,బీజేపీ ఒక మండలంలో ఆధిపత్యం ప్రదర్శించినట్లు స్పష్టం చేస్తున్నాయి.

## ప్రశాంతంగా గ్రామపంచాయతీ ఎన్నికలు



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ నియోజకవర్గంలో మొదటి దశ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి.పంచాయతీ ఎన్నికల పరిశీలకురాలు ఆయేషా మస్రత్ ఖానం ఖానాపూర్,పెండి,కడెం,మండలాల్లో గల ఎన్నికల కేంద్రాలను తనిఖీ చేశారు.ఆయా మండలాల్లో గ్రామపంచాయతీలో ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.ఖానాపూర్ 79.30శాతం,పెంబి 83.46 శాతం,కడెం 79.87శాతం,దాస్తురాబాద్ 81.23 శాతం గా ఓటింగ్ నమోదయిందని అధికారులు తెలిపారు.ఓటు వేయడానికి వచ్చే వృద్ధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రాలో వీల్చరులు అందుబాటులో ఉంచారు.ఉదయం ఏడు గంటల నుండి ఒంటిగంట వరకు పోలింగ్ కేంద్రాల వాడిన ప్రజలు ఓపికతో ఉండి ఓట్లు వేశారు.ఆయా గ్రామాల్లో ఓటింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భద్రత కల్పించారు.పెండి మండలంలో మారుమూల ప్రాంతాలైన యాపాలగూడ దొంధరి అంకెన,పులగంపండ్రి గ్రామాలను రోడ్డు సౌకర్యం లేక ఎన్నికల అధికారులు తెప్పలపై ప్రయాణించలసి వచ్చింది.ఈ ఎన్నికల ప్రక్రియలో జిల్లా అధికారులు మండలాధికారులు సమన్వయంతో పని చేశారని ఆయా మండలాల ఎమ్మార్వోలు ఎంపీడీవోలు తెలిపారు.

## కింద పడిపోయి వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలకేంద్రంలోని ఓ వైన్స్ షాప్‌లో గల పర్మిట్ రూంలో వడ్డేపల్లి గ్రామానికి చెందిన మంగలి సాయిలు(40) అనే వ్యక్తి కింద పడిపోయి మృతిచెందినట్లు నిజాంసాగర్ ఎస్సై శి వకుమార్ తెలిపారు. మృతుడు పర్మిట్ రూం లో మద్యం సేవిస్తుండగా అఖస్మాత్తుగా కింద పడిపోయి మృతిచెందినట్లు చెప్పారు. మృతుని సోదరుడు మంగలి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## అభివృద్ధి జరగాలంటే బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి

### ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ నియోజవర్గంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే బిఆర్ఎస్ సర్పంచులను, వార్డు సభ్యులను గెలిపించాలని ఆసిఫాబాద్ ఎంఎల్ఎ కోవ లక్ష్మి కోరారు. గురువారం ఆసిఫాబాద్ మండలం రాజంపేట గ్రామ సర్పంచ్ అభ్యర్థి బుర్స పోచయ్య, వార్డు సభ్యుల గెలుపు కోసం ఆమె ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో ప్రజలకు అందిన కల్యాణ లక్ష్మి, రైతు బంధు వంటి సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ బలపరిచిన అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ప్రజలకు భరోసా కల్పించారు. ప్రచారంలో సింగిల్ విండో చైర్మన్



అలిబిన్ అహ్మద్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మర్సకోల సరస్వతి, టౌన్ ప్రెసిడెంట్ అహ్మద్ భాయ్, కోవ సాయినాథ్, గంధం శ్రీను, నిస్సార్ భాయ్, అన్సార్ భాయ్, చిలువేరు వెంకన్న, సాజిద్, ఉమారాణి, లలిత, సుప్రజ, సంగీత తదితరులు పాల్గొన్నారు.

## ముధోల్‌లో ప్రారంభమైన స్థానిక ప్రచార హోరు..



**ప్రజాపక్షం/ముధోల్ :** మేజర్ గ్రామ పంచాయతీ అయిన ముధోల్ మండల కేంద్రంలో స్థానిక ప్రచారహోరు ప్రారంభమయింది.రెండవ రోజైన గురువారం బరిలో నిలిచిన అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారంలో ముందుకు సాగుతున్నారు.సర్పంచ్ బరిలో మొత్తంగా మంది ఉన్నారు.గతంలో కొందరు సర్పంచ్ బరిలో నిలిచిన వారైతే మరి కొందరు కొత్త వారు.జనరల్ మహిళ రిజర్వేషన్ రావడంతో మహిళా అభ్యర్థులు తమ పతులతో కలిసి హోరాహోరి ప్రచారం నిర్వహిస్తున్నారు.ఇంత పెద్ద మేజర్ గ్రామ పంచాయతీలో పార్టీ అభ్యర్థుల సమన్వయం లేకపోలేదు.కాంగ్రెస్ నుండి ముగ్గురు అభ్యర్థులు,బీజేపీ నుండి ఇద్దరు అభ్యర్థులు మిగతా వారు స్వతంత్రంగా నిలబడ్డారు.ప్రధాన పార్టీల నుండి ఒకరే అభ్యర్థి అయి ఉండి ఉంటే పార్టీ పెద్ద నాయకులు ప్రచారంలో పాల్గొని వారి గెలుపుకు సహకారం అందించేవారు.ఇప్పుడు జరిగే ఎన్నికల్లో ఒకే పార్టీ నుండి అనేక మంది అవడంతో పార్టీ పెద్దలు ప్రచారానికి దూరమయ్యారు.ఇక స్థానికంగా వారికున్నా సమన్వయ నాయకులను కలుపుకుని ప్రచారం సాగిస్తున్నారు.ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ ఓటేసి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపెడదామని చేస్తున్న వాగ్దానాలు మిన్నంటుతున్నాయి.ఇచ్చి వాగ్దానాలు చేస్తున్న ప్రజలు ఎవరి వైపు మొగ్గు చూపుతారో ఎన్నికల రోజే తెలియాల్సి ఉంది.

## షిర్డీలో బెల్లంపల్లి భక్తుల పల్లకి సేవ



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** షిర్డీలో సాయి బాబా పల్లకి సేవను బెల్లంపల్లి భక్తులు ఘనంగా నిర్వహించారు. పల్కి నివార్ నుండి ద్వారకామాయి, కండోబా మందిరం మీదుగా సమాధి మందిర్ వరకు 200 మంది భక్తులతో ఊరేగింపు సాగింది. బాజ భజంత్రీలు, కోలాటాలు, ఆటపాటలతో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ సేవకులు ఆవునూరి దుర్గయ్య, ఆకుల కుప్పుస్వామి, సుద్దాల శ్రీనివాస చారి, కుంభాల రాజేష్, ఎనగందుల దత్తు, ఎనగందుల చరణ్, మేడి గోపాల్, పీక చాణక్య, మంతెన కిరణ్, దర్శన్, శివశంకర్, సాయిశ్వర్, సాయి రాఘువ, నవీన్, లలిత, సాహితి, లక్ష్మి, శైలజ, సుగుణ, బాయమ్మ, కనకమ్మ, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలు సాధించాలి

### ఎడ్యుకేషనల్ జిఎం వెంకటాచారి

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** రాబోయే పదవ తరగతి పరీక్షలకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకొని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎడ్యుకేషనల్ జిఎం ఎస్ వెంకటాచారి విద్యార్థులకు సూచించారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియా సిసిసిలోని సింగరేణి ఉన్నత పాఠశాలను కరస్పాండెంట్ ఎం రాజేష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను, తరగతుల నిర్వహణను స్వయంగా పరిశీలించారు. అనంతరం సిబ్బందితో జరిగిన సమావేశంలో మాట్లా



డుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు

## ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

### జిల్లా ఎస్‌పి నితికా పంత్

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** గ్రామ పం చాయతీ ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని జిల్లా ఎస్‌పి నితికా పంత్ తెలిపారు. జిల్లాలో తొలి విడత ఎన్నికల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఆమె మాట్లాడారు. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు 750 మంది పోలీసు సిబ్బంది, క్యూఆర్టి, స్ట్రైకింగ్ ఫోర్సులను మోహరించామని పేర్కొన్నారు. గెలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఉండాలని సూచించారు. విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, డీజేలు, ఊరేగింపులు నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే రిమాండ్ చేస్తామని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజలు సహకరించాలని కోరారు.

## 13న జవహర్ నవోదయా ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** ఈనెల 13వ తేదీ శనివారం నవోదయా విద్యాలయానికి సంబందించి 6వ తరగతిలో ప్రవేశానికి గాను ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని నవోదయా విద్యాలయ ప్రిన్సిపాల్ గురువారం సాయంత్రం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ పరీక్ష 6వ తరగతిలో ప్రవేశానికి మొత్తం 5124 మంది విద్యార్థులు హాజరుకానుండగా నిజామాబాద్ జిల్లా నుండి 2240 మంది, కామారెడ్డి జిల్లా నుండి 2884 మంది విద్యార్థులు హాజరవుతారని, పరీక్ష రాసే విద్యార్థులు ఉదయం 11 గం.ల లోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, లేని యెడల పరీక్ష రాయడానికి అనుమతించబడరు అని తెలిపారు. ఉదయం 11.30 గం.ల నుండి మద్యాహ్నం 1.30 గం.ల వరకు పరీక్ష ఉంటుందని, హాల్ టికెట్‌తో పాటు విద్యార్థులు నిర్దారణ కొరకు ప్రభుత్వం జారీ చేసిన ఆధార్, రేషన్ కార్డు తీసుకురావాలన్నారు. పరీక్షకు సంబందించి ఏవైనా సందేహాలు ఉంటే నవోదయా విద్యాలయ ప్రిన్సిపాల్, ఇంచార్జీ ప్రభాకర్ సెల్ 9701907749 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## ప్రశాంతంగా ముగిసిన మొదటి విడత ఎన్నికలు

**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ డివిజన్ పరిధిలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎనికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికలు సజావుగా సాగేందుకు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమీషనర్ సాయి చైతన్య లు పకడ్బందిగా చర్యలు తీసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గం ట వరకు కొనసాగాయి. బోధన్ డివిజన్ పరిధిలో 81. 37శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

# మడవి రాజేష్‌ను గెలిపిస్తే ఐదేళ్ల ఇంటి పన్ను మేమే కడతాం

### కాంగ్రెస్ నాయకుడు అనిల్ గౌడ్

**ప్రజాపక్షం / తిర్యాణి/ ఆసిఫాబాద్ :** తిర్యాణి గ్రామ పంచాయతీ కాంగ్రెస్ బలపరుస్తున్న అభ్యర్థి మడవి రాజేష్‌ను గెలిపిస్తే ఓటు వేసిన వారందరికీ ఐదేళ్ల పాటు ఇంటి పన్ను తామే చెల్లిస్తామని జిల్లా కాంగ్రెస్ నాయకులు అనిల్ గౌడ్ హామీ ఇచ్చారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పది హామీలతో కూడిన కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, మాజీ ఎంఎల్ఏ సక్కు, మాజీ డిసిసి అధ్యక్షులు విశ్వప్రసాద్ సూచన మేరకు మడవి రాజేష్‌ను అభ్యర్థిగా ప్రకటించినట్లు తెలిపారు. యువత కోసం క్రీడా మైదానం, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. మూడు కోట్ల వ్యయంతో వంతెన, మోడల్ స్మశాన వాటిక నిర్మించి అంత్యక్రియల ఇబ్బందులు తొలగిస్తామని చెప్పారు. ప్రతి ఇంటికి ఉచిత మంచినీటి కనెక్షన్, పది వార్డుల్లో మురికి కాలువలు, అంతర్గత రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. రజకులకు దోభీఘాట్ల నిర్మాణం, భీమారం హనుమాన్ ఆలయ సుందరీకరణకు నిధులు మంజూరు చేయిస్తామని, ఇళ్ల నెంబర్ల సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు చిత్తారి సాగర్, అభ్యర్థి మడవి రాజేష్, సీనియర్ నాయకులు పెరుమాండ్ల వెంకటేశం గౌడ్, యూత్ అధ్యక్షులు పున్నం



హరీష్ కుమార్, ఉపాధ్యక్షులు పులిశెట్టి రాజు, ఎస్‌సి సెల్ అధ్యక్షులు పడిగేల అమర్, నాయకులు కరిగంటి బాబు, మేన రాజు, పడాల శేఖర్ గౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# సర్పంచ్ అభ్యర్థిగా జర్నలిస్ట్ వాసు



**ప్రజాపక్షం/బోధన్:** తెలంగాణ రాష్ట్ర మొదటి విడత ఎన్నికలలో భాగంగా నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోతంగల్ మండలం బాకర్ ఫారం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కనకమెడల శ్రీనివాస్ రావు (వాసు) భారీ మేజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలలో బాకర్ ఫారం గ్రామ సర్పంచ్‌గా గెలుపొందడం సంతోషంగా ఉందని, ఈ విజయం గ్రామస్తుల విజయంగా భావిస్తున్నానన్నారు. గ్రామస్తులందరూ జర్నలిస్టుగా నాకున్న అనుభవాన్ని గుర్తించి వారి ప్రేమ ఆప్యాయతలు చూపించడం సంతోషంగా ఉందని ఈ విజయం సాధించడానికి గ్రామస్తులే కారకులని అన్నారు. బాకర్ ఫారం గ్రామాన్ని పోతంగల్ మండలంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా నిల్వ

**ప్రజాపక్షం / నందిపేట్ :** ఈరోజు ఎంఏఓ మధుసూదన్, పిఏసిఎస్ ఇన్‌చార్జి రాజు పిఏసిఎస్ సిర్పూర్‌లో యూరియా విక్రయాలపై ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రస్తుతం మండలంలో సుమారు 146.28 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. అవసరానికి మించి లేదా భవిష్యత్తు కోసం యూరియా నిలువచేసుకోవడం మానుకోమని, అందరికి సమానంగా ఎరువు అందేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు స్పష్టం చేశారు.

## నందిపేట్, డొంకేశ్వర్ మండల ప్రజలకు పోలీసు వారి విన్నపం

**ప్రజాపక్షం / నందిపేట్:** ఎన్నికల సమయంలో వాట్సాప్ సోషల్ మీడియాలోగాని ఎవరిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయరాదు. ఓటర్లు అందరు తప్పకుండా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడుతాయని నందిపేట్ ఎస్ఐ శ్యామ్ రాజ్ తెలిపారు.

## సిర్పూర్ సర్పంచ్ ఏకగ్రీవం

**ప్రజాపక్షం / నందిపేట్ :** డొంకేశ్వర్ మండలంలో సిర్పూర్ గ్రామంలో ఏకగ్రీవం అయిందని మండల అధికారి నాయక్ తెలిపారు. అలాగే 48, వార్డులు ఏకగ్రీవం 118 వార్డులు రంగంలో ఉన్నారని ఆయన చెప్పారు. నందిపేట్ మండలంలో 33 వార్డులు ఏకగ్రీవం, 77 సర్పంచ్‌లు, 492 వార్డులు రంగంలో ఉన్నారని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు.

# నందిపేట్ ఎన్నికల కేంద్రాన్ని సందర్శన

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ గ్రామ పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని గురువారం ఆర్మూర్ ఏసిపి నందిపేట్ సిఐ, నందిపేట్ ఏపిడివో సందర్శించారు.

# బాధిత కుటుంబాలను పరామర్శ

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** పలు కుటుంబాలను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. గురువారం భీమ్‌గల్ చేరుకున్న ఎమ్మెల్యే ఇటీవల మృతి చెందిన లింబాద్రిగుట్ట ధర్మకర్త నంబి లింబాద్రి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రఘు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు గున్నాల భగత్, నర్సయ్య, ప్రసాద్, నవీన్, ఇక్రమ్, మెయిస్, లాల సాగర్ ఉన్నారు.

# గెలిపిస్తే ఇంటింటికి మినరల్ వాటర్, సిసి కెమెరాలు

### సర్పంచ్ అభ్యర్థి పెద్దింటి శ్రీకాంత్

**ప్రజాపక్షం / రెబ్బెన :** రెబ్బెన మండలం కొమురవెల్లి గ్రామ పంచాయతీలో చేసిన అభివృద్ధిని మరువొద్దని, కొత్త పథకాలతో ప్రజల ముందుకు వస్తున్నానని సర్పంచ్ అభ్యర్థి పెద్దింటి శ్రీకాంత్ అన్నారు. గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ఆయన జోరుగా నిర్వహించారు.ఈసారి గెలిపిస్తే ఇంటింటికి మినరల్ వాటర్, ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గెలిచిన నెల రోజుల్లో నీటి సమస్య ఉన్న వీధుల్లో కొత్త బోర్ వెల్స్ వేయిస్తానని తెలిపారు. ఐకెపి కేంద్రానికి శాశ్వత స్థల కేటాయింపు, నారాయణపూర్ నుండి కొమురవెల్లి ప్రధాన రహదారి



ఒర్రెకు కల్వర్టు నిర్మిస్తానని పేర్కొన్నారు. పోచమ్మ, భీమన్న, ఎల్లమ్మ ఆలయాలకు రోడ్డు మంజూరు చేయిస్తానని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూస్తానని తెలిపారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తానన్నారు. తన వద్ద డబ్బు లేకపోయినా సమస్యలపై పోరాడే తత్వం ఉందని, డబ్బుకు ప్రలోభపడకుండా ఊరికి మంచి చేసే వారిని గెలిపించాలని కోరారు.

# రసవత్తరంగా కమ్మర్‌పల్లి సర్పంచ్ ఎన్నికలు

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** గ్రామపంచాయతీలకు సర్పంచ్ ఎన్నికలు జరుగుతుండగా పోటీ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తమ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించుకుని ఉనికి కాపాడుకోవాలని ప్రయత్నిస్తుండగా అధికారంలోని కాంగ్రెస్ పార్టీ తమ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకుని పట్టు నిలుపుకోవాలని ప్రయత్నిస్తుండగా బీజేపీ హిందూ వాదంతో ఎలాగైనా గెలవాలని తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా కమ్మర్‌పల్లి గ్రామపంచాయతీకి చతుర్ముఖ పోటీ నెలకొంది. కమ్మర్‌పల్లి గ్రామపంచాయతీ బీసీ మహిళకు రావటంతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకెట రవి వ్యూహాత్మకంగా వ్యవహరించి విద్యావంతురాలైన వినీల ప్రదీప్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుని సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టడం జరిగింది. మరోవైపు బీఆర్ఎస్ కొత్తపల్లిహారిక అశోక్‌ను పోటీలు నిలపగా బీజేపీ తరపున భోగ మధులత రామస్వామి, స్వతంత్ర్య అభ్యర్థిగా అనిత రవీందర్ పోటీ చేస్తున్నారు.



# ట్రేనీ ఐఎఎస్‌కు సన్మానం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మున్సిపల్ కార్యాలయం ఎదురుగా బంగారు దుకాణాలకు అడ్డంగా ఉన్న మార్కెట్‌ను పాత తహసీల్దార్‌కు తరలించేందుకు కృషి చేసిన ట్రేనీ ఐఎఎస్ అధికారిన కరోలిని బంగారు వర్తకులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం బంగారు వర్తక సంఘం ఆధ్వర్యంలో ట్రేనీ ఐఎఎస్‌ను మున్సిపల్ కార్యాలంలో కలిసారు. ట్రేనీ కలెక్టర్ కరోలినిని పూలమాలలు, శాలువతో సన్మానించారు. తమ దుకాణాలకు అడ్డంగా ఉన్న కూరగాయల మార్కెట్ ద్వారా కలిగే ఇబ్బందులను తెలుపుతూ వ్యాపారులు, అఖిలపక్షం మద్దతుతో గతంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధ్యతలో ఉన్న అధికారిని క్షేత్రస్థాయిలో సమస్యను గుర్తించి మార్కెట్‌ను ఓల్డ్ తహసీల్దార్ కార్యాలయం ఓపెన్ ప్లేస్‌కు తరలించాలని ఆదేశించారు. దాంతో వ్యాపారలు సమస్య పరిష్కరించిన మేడంను వ్యాపారులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వంశీ, నర్సయ్య, శ్రీపాద శ్యామ్, శ్రీపాద గోపి, నూనె పురుషోత్తం, దాసు, నరేందర్, విజయ్, యశ్వంత్, ధర్మపురి ఉన్నారు.



# సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్ష



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** ఈ నెల 23న ప్రగతి స్టేడియంలో నిర్వహించే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గురువారం ఆయన మాట్లాడుతూ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, అధికారులకు కేటాయించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వేడుకలను వీక్షించడానికి వచ్చిన వారికి తగిన సదుపాయాలు కల్పించాలన్నారు. ఆ రోజున జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు, ప్రగతి స్టేడియంలో ఉదయం 11.00 గంటలకు జెండా ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. అనంతరం స్టాల్స్ ప్రారంభం, సాయంత్రం 5.30 గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగుల సన్మానం, ఉత్తమ గృహాలకు బహుమతుల అందజేత ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం ఎన్. సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, ఏరియా ఇంజినీర్ రమణ రావు, ఏజెంట్లు కుర్మా రాజేందర్, రవి కుమార్, డిజిఎంలు అనిల్ కుమార్, రాజన్న ఆనంద్ కుమార్, హరి నారాయణ, రవీందర్, మల్లయ్య, విజయ్ కుమార్, చంద్రశేఖర్, లా అధికారి మల్లేష్, చంద్ర లింగం, వివిధ గనుల మేనేజర్లు, విభాగాల ఆధిపతులు పాల్గొన్నారు.

# ముగిసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం నుంచి నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. గురువారం రోజున పద్మావతి ఆలివేలు మంగ శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం అశేష జనం మధ్యలో కన్నుల పండుగ జరిగింది. జాతర సందర్భంగా గురువారం ఉదయం నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనేక మంది భక్తులు పాల్గొని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకొని స్వామి ఆశీర్వాదాలు పొందారు. ఈ జాతర ఉత్సవంలో అనేక మంది భక్తులు పాల్గొని వారు మొక్కుకున్న మొక్కులు తీర్చుకొని గ్రామంలోని పిల్లపాపలను చల్లంగా చూడాలని, గ్రామంలో రైతన్నలు పండిస్తున్న పంటలు సమృద్ధిగా పండి రైతులకు ఎక్కువ లాభాలు వచ్చి వారు అభివృద్ధి బాటలో నడవాలని భక్తులు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని కోరుకున్నారు.

# ఎరువుల విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు

### జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/ ఎడపల్లి:** అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తున్నామని, ఎరువుల విషయంలో ఎవ్వరూ ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ లోని సహకార సంఘం ఎరువుల గోడౌన్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రబీ సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. గిడ్డంగిలో రికార్డులలో పేర్కొన్న విధంగా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయా..? అని పరిశీలించారు. స్టాక్ కొంత మిగిలి ఉన్నప్పుడే ఇండెంట్ సమర్పించి, ఎరువులను గోడౌన్‌కు తెప్పించుకోవాలని నిర్వహకులకు సూచించారు. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ భరోసా కల్పించారు.

